క్లుప్తంగా

ఇంటింటి సర్వే.. అనారోగ్య సమస్యలపై ఆరా

పెడన: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాలతో సోమవారం పట్టణంలోని తొమ్మిది సచివాలయాల పరిధిలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఏఎన్‌ఎం, ఆశా వర్కర్‌తో పాటు సచివాలయ సిబ్బంది ముగ్గురు చొప్పున ఒక్కో సచివాలయం పరిధిలో ఇంటింటికీ తిరిగి అనారోగ్య సమస్యలపై ఆరా తీసి నమోదు చేసుకున్నారు. విరేచనాలు, వాంతులతో ఉన్న వారిని గుర్తించాలని స్పష్టమైన ఆదేశాలు వెలువడంతో వైద్య, సచివాలయ సిబ్బంది ఆరా తీశారు. తొమ్మిది సచివాలయాల పరిధిలో 1,210 ఇళ్లను సర్వే చేశారని, ఎవరికీ కూడా డయేరియా లక్షణాలు లేవని మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య స్పష్టం చేశారు.

● ఈ సర్వే సమయంలోనే ప్రజలకు మీ కోసం కార్యక్రమం గురించి తెలిపారు. ప్రతి సోమవారం సచివాలయంతో పాటు మున్సిపల్ కార్యాలయంలో కూడా ఉదయం పది గంటలకు మీ కోసం కార్యక్రమం ద్వారా సమస్యలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదులు స్వీకరిస్తారని పేర్కొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థికి ఆర్థిక సాయం



అవనిగడ్డ: దివిసీమ భీంజీ అసోసియేషన్ ఆధ్వర్యంలో టెన్త్‌క్లాస్ మెరిట్ విద్యార్థి ఉల్లిపాలెంకు చెందిన ఆరిగ అఖిల్‌కు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చేతుల మీదుగా రూ.10 వేలు నగదు ప్రోత్సాహం అందించారు. ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో బుద్ధప్రసాద్ ఈ మొత్తాన్ని అఖిల్, అతని తల్లి సరళకుమారికి అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 2019 నుంచి దివిసీమ భీంజీ అసోయేషన్ ద్వారా నిర్వాహకులు పోలాబత్తిన బిపిన్ చంద్రపాల్ పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

అన్నసమారాధన

మచిలీపట్నంటౌన్: నగరంలోని రాబర్ట్‌సన్‌పేటలో వేంచేసియున్న శ్రీ రంగనాయకస్వామి ఆలయంలో సోమవారం అన్నసమారాధన చేశారు. నగరానికి చెందిన వేలాది మంది భక్తులు కార్యక్రమానికి హాజరై స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ నెల 16న ప్రారంభమైన స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు 22వ తేదీ శనివారంతో ముగిశాయి. బ్రహ్మోత్సవాల ముగింపు అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన జరిగింది. కార్యక్రమాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు పర్యవేక్షించారు.

పైప్‌లైన్ నిర్మించాలని వినతి

మోపిదేవి: మోపిదేవి పంచాయతీలో సుమారు 45 ఏళ్ల క్రితం వేసిన వాటర్ పైప్‌లైన్ శిథిలం కావడంతో మురుగునీరు వస్తోందని, వెంటనే దాన్ని తొలగించి కొత్త పైప్‌లైన్ వేయించాలని టీడీపీ, జనసేన నేతలు తహసీల్దార్ శ్రీవిద్యకు వినతిపత్రం అందజేశారు. సోమవారం మీ కోసం కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు.

పేద విద్యార్థినికి ల్యాప్‌టాప్



మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం ఆదివెలమ శ్రేయోభివర్ధిని సంఘం కార్యాలయంలో సోమవారం పేద విద్యార్థిని ఐనాల నాగసాయి హరిణికి సంఘ ప్రతినిధుల చేతుల మీదుగా రూ. 60 వేలు విలువైన ల్యాప్‌టాప్‌ను అందజేశారు. బలరామునిపేటకు చెందిన కుల్లి కుప్పారావు 100వ జయంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు విద్యార్థిని నాగసాయి హరిణికి ల్యాప్‌టాప్‌ను నగరంలోని సంఘ కార్యాలయంలో అధ్యక్షుడు పిల్లారిశెట్టి శ్రీనివాసరావు ఇతర నాయకుల చేతుల మీదుగా అందజేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ప్రతి విద్యార్థి చదువుపై శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో ఆది వెలమ సంఘం ప్రతినిధులు అంకాల సుబ్బారావు, తాతబాబు, మరకాని వాసు, పిల్లారిశెట్టి సత్యనారాయణ, డాక్టర్ కోశా శివప్రసాద్, పరిమి అప్పలస్వామి, మాదిరెడ్డి ఈశ్వర్, మంగపతి తదితరులు పాల్గొన్నారు.

విట్‌లో సీటు సాధించిన విద్యార్థికి పురస్కారం



బంటుమిల్లి: మారుమూల గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ నుంచి వరుసగా రెండోసారి వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(విఐటీ)లో సీటు సాధించడం ఈ ప్రాంత ప్రజలకు గర్వకారణమని విశ్రాంత జిల్లా విద్యాశాఖాధికారి మట్టా రాధాకృష్ణమూర్తి అన్నారు. ఈ సంవత్సరం కాలేజీ నుంచి విట్‌లో సీటు సాధించిన జి. సాయివెంకటగణేష్ అభినందన కార్యక్రమాన్ని కాలేజీ ఆవరణలో సోమవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ జ్యోతి అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విట్‌లో సీటు దక్కించుకున్న విద్యార్థికి రూ. 5 వేలు నగదు బహుమతి అందజేసి అభినందించారు. పలువురు విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేశారు.

పసిరిక మేతతో పశువుల్లో గొంతువాపు

● పశువుల్లో సీజనల్ వ్యాధులను గుర్తించాలి
● ముందస్తుగా వ్యాక్సిన్ వేయించాలి



పసిరిక మేత మేస్తున్న పశువులు

కృత్తివెన్ను: పశువుల్లో సీజనల్ వ్యాధులను ముందుగానే గుర్తించాలి. తొలకరి ప్రారంభమైంది. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు చేలల్లో పచ్చిక పెరుగుతోంది. వీటిని పశువులు తినడంతో వాటిలో ఉండే బ్యాక్టీరియా వాటి ఆరోగ్యంపై తీవ్ర దుష్పరిణామాలు చూపుతాయి. దీంతో వచ్చే వ్యాధుల్లో హెచ్ ఎస్ (గొంతువాపు వ్యాధి) ఒకటి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా ఎక్కడ చూసినా పచ్చదనం కనిపిస్తోంది. ఈ పసిరిక మేతలో ఉండే ఫ్యాశ్చురుల్లా మల్టోసిడా అనే బ్యాక్టీరియా కారణంగా పశువులకు ఈ గొంతు వాపు వ్యాధి సోకుతుంది. దీని ప్రభావం తీవ్రమైతే పశువు మృత్యువాత పడుతుంది. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో అధిక శాతం ప్రజలు కేవలం పాడి రంగాన్నే నమ్ముకుని జీవిస్తున్నారు. దీని కారణంగా పశువుల ఆరోగ్య భద్రతా దృష్ట్యా పాడి రైతుల పశువులకు ప్రభుత్వం ఉచితంగా వ్యాక్సిన్‌ను అందించాల్సిన అవసరముంది.

వ్యాధి లక్షణాలు

అన్ని రకాల పశువులకు ఈ వ్యాధి సోకే అవకాశాలున్నాయి. పశువుకు అధిక జ్వరం 104 డిగ్రీలు పైబడి ఉంటుంది. సకాలంలో గుర్తించకపోతే వారం రోజుల్లోనే పశువు మరణించవచ్చు. బలమైన పశువుల కంటే దూడలకు ఈ వ్యాధి త్వరగా సోకే ప్రమాదం ఉంది. వ్యాధి రాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా హిమరైజిక్ సెప్టీసెమియా (హెచ్‌ఎస్) అనే వ్యాక్సిన్‌తో నివారించవచ్చు.

అప్రమత్తం కావాలి

వర్షాలు పడి పచ్చమేత అధికమవుతున్న తరుణంలో ఈ వ్యాక్సిన్‌ను వేయాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే వర్షాలు పడిన తర్వాత మొలకెత్తే పసిరిక మేతలోని చిగురుల్లో ఈ ప్రమాదకర బ్యాక్టీరియా దాగుంటుంది. దీంతో గడ్డిని తిన్న పశువులకు వ్యాధి సోకే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ముందస్తుగా వ్యాక్సిన్ పశువులకు వేస్తే వాటికి ఎలాంటి ప్రమాదం ఉండదని పశువైద్యులతో పాటు పాడిరైతులు కోరుతున్నారు. మండలంలో 6,900 గేదెలు, 1,410 ఆవులు ఉన్నట్లు పశువైద్యుల గణాంకాలు చెబుతున్నాయి.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ విద్యాసాగర్



మాట్లాడుతున్న డీఎస్పీ మురళీధర్

కోనేరుసెంటర్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఇనగుదురుపేట పోలీస్‌స్టేషన్ సి.ఐ. విద్యాసాగర్ తెలిపారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశాల మేరకు సోమవారం బాల సాయి డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఇటీవల యువత గంజాయి తదితర మత్తు పదార్థాలకు బానిసవుతున్నారన్నారు. మాదక ద్రవ్యాలతో అనారోగ్యం పాలై జీవితం అంధకారమవుతుందన్నారు. యువత చదువుతో పాటు క్రీడలపై మక్కువ పెంచుకోవాలని, క్రమశిక్షణతో కూడిన చదువుతో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలు తీసుకోవడంతో ఎన్నో అనారోగ్య ఇబ్బందులను ఎదుర్కొని బంగారు భవిష్యత్తును కోల్పోతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై ఎండీ మక్బూల్, పోలీస్ సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

చల్లపల్లి(అవనిగడ్డ): విద్యార్థులు మాదక ద్రవ్యాల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ చెప్పారు. స్థానిక విజయ క్రాంతి జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం విద్యార్థులకు మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ దుట్టా శివరాంప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమలో సీఐ నాగప్రసాద్, ఎస్‌ఐ సత్యనారాయణ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారంపై దృష్టి

పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



మల్లేశ్వరం రక్షిత మంచినీటి చెరువును పరిశీలిస్తున్న పెడన ఎమ్మెల్యే కాగిత

బంటుమిల్లి: తాగునీటి సమస్య పరిష్కారంపై దృష్టి సారించాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. పెడన నియోజవకర్గ స్థాయిలో జరుగుతున్న పనులపై పలు ఇంజినీరింగ్ శాఖల అధికారులతో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్(కేపీ) సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. నాగేశ్వరరావుపేట గ్రామంలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇరిగేషన్, డ్రైనేజీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖల ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాగిత.. తాగునీటి సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టారు. నియోజకవర్గంలో తాగునీటి చెరువుల్లో నీటి నిల్వలపై వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. జలజీవన్ మిషన్(జేజేఎం) పనుల వివరాలను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను అడిగారు. దీనిపై వారు స్పందిస్తూ నియోజకవర్గ స్థాయిలో రూ. 12 కోట్ల అంచనాలు వేయగా రూ. 8 కోట్లకు అగ్రిమెంటు అయ్యిందన్నారు. ఇందులో ఇప్పటికి 80 శాతం పనులు పూర్తైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నటరాజు వివరించారు. అనంతరం అధికారులతో కలసి మల్లేశ్వరం గ్రామంలో రక్షిత మంచినీటి చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా కాగిత మాట్లాడుతూ పాత చెరువుతో కొత్త చెరువును అనుసంధానం చేసి తాగునీరు పరిష్కారానికి తీసుకోవలసిన చర్యలకు అంచనాలు తయారు చేయాలని ఆదేశించారు. డయేరియా కేసులు నమోదు అవుతున్న క్రమంలో తాగునీటి సరఫరాలో జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే కాగిత అధికారులను హెచ్చరించారు. పంట కాల్వలకు నీటి విడుదల ఎప్పుడు జరుగుతుందని ఇరిగేషన్ డీఈ గణపతిని అడిగారు. దీనిపై ఆయన స్పందిస్తూ నీటి నిల్వలు తక్కువగా ఉండటంతో పట్టిసీమ నుంచి త్వరలో నీటి విడుదలకు అవకాశం ఉందన్నారు. మచిలీపట్నం ఎంపీ బాలశౌరి మంజూరు చేసిన పార్లమెంటు నియోజకర్గ నిధులు దాదాపు రూ. కోటితో నిర్మిస్తున్న పనులు యండపల్లి గ్రామం వద్ద బంటుమిల్లి ప్రధాన కాల్వపైన, యండపల్లి డ్రైన్‌పై నీలిపూడి గ్రామం వద్ద నిర్మిస్తున్న వంతెన పనుల పురోగతిని అధికారులు ఎమ్మెల్యే కాగితకు వివరించారు. సమావేశంలో డీఈలు గణపతి, నటరాజు, ఏఈలు వి. నాగేశ్వరరావు, నాగేశ్వరరావు, నగేష్, విశ్వకుమార్, సర్పంచ్ సీహెచ్ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ బి. రమేష్, భూపతిరెడ్డి, కాశీ తదితరులు పాల్గొన్నారు.

తీరప్రాంత ప్రజలకు సురక్షిత నీరు

కమ్మనమోలు సామూహిక రక్షిత పథకం పరిశీలించిన ఎమ్మెల్యే మండలి



'కమ్మనమోలు' రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

కమ్మనమోలు(నాగాయలంక): తీరప్రాంత ప్రజలకు సురక్షిత నీరు అందించాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. మండలంలోని కమ్మనమోలులో 14 గ్రామాల నీటి అవసరాలను తీరుస్తున్న సామూహిక రక్షిత మంచినీటి పథకం ఫిల్టర్ బెడ్‌లు, రిజర్వాయర్లను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలసి సోమవారం పరిశీలించారు. ఎన్టీఆర్ జిల్లాలో డయేరియా ప్రబలిన నేపథ్యంలో తీర ప్రజలకు సురక్షిత నీటిని అందించాలంటూ అధికారులకు సూచించారు. ప్రజలు ఆందోళన చెందకుండా ఉండటానికి ముందస్తుగా గ్రామంలోని ఈ పథకం సందర్శనకు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజలకు తాగునీటి వనరులు అందించడంలో అధికారులు విఫలమైతే సహించబోనని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను హెచ్చరించారు. రిజర్వాయర్లలోని నీరు ఎండలకు చిక్కబడి పసర్లు కమ్మడంతో ఫిల్టరైజేషన్ సక్రమంగా జరగడం లేదని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సక్రమంగా లేని ఫిల్టరైజేషన్ బెడ్‌ల ద్వారా నీటి సరఫరా చేస్తే ఎలా అని అధికారులను నిలదీశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సమస్యలను గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని బుద్ధప్రసాద్ చెప్పారు. గ్రామంలోని పంచాయతీ చెరువుకు ఫెన్సింగ్ వేయించాలని గ్రామ మహిళలు ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. ఎమ్మెల్యే వెంట ఆయన తనయుడు రాజా, భావదేవరపల్లి సర్పంచి మండలి ఉదయభాస్కర్, ఉప సర్పంచ్ వెంకటేశ్వరరావు, టీడీపీ నేత మండవ బాలవర్ధిరావు, ముమ్మారెడ్డి శ్రీనివాసరావు, ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టర్ డీకే బాలాజీని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సోమవారం ఆయన చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

యార్లగడ్డ పంచాయతీ కార్యదర్శిపై వీఆర్వోల ఫిర్యాదు

చల్లపల్లి(అవనిగడ్డ): వీఆర్వోపై బెదిరింపునకు పాల్పడుతున్న యార్లగడ్డ పంచాయతీ కార్యదర్శి కొండవీటి చంద్రహరీష్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ బి.సుమతికి మండల వీఆర్వోల సంఘం నేతలు సోమవారం ఫిర్యాదు చేశారు. యార్లగడ్డ వీఆర్వో పామర్తి కోటేశ్వరరావును పంచాయతీ కార్యదర్శి చంద్రహరీష్ అకారణంగా దూషిస్తున్నట్లు సంఘం మండల అధ్యక్షుడు పరిశె కిరణ్‌కుమార్ తహసీల్దార్‌కు చెప్పారు. తాను డీడీవోనని తలచుకుంటే ఏదైనా చేయగలనని బెదిరిస్తున్నట్లు తెలిపారు. జీతం అడిగితే దౌర్జన్యం చేస్తున్నారని అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అమలేశ్వరరావు, కె.కిరణ్, జయరాం పాల్గొన్నారు.

'మీ కోసం'లో నాలుగు అర్జీలు



పెడన: పురపాలక సంఘ కార్యాలయంలో సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన మీ కోసం కార్యక్రమం ద్వారా నాలుగు అర్జీలు వచ్చాయని మున్సిపల్ కమిషనర్ బి. వెంకటరామయ్య తెలిపారు. వీటిలో మూడు. ఇంటి పన్నులకు సంబంధించి, మరొకటి పుట్టిన తేదీ గురించి వచ్చాయని పేర్కొన్నారు. వాటిని సంబంధిత విభాగాధిపతులకు పంపి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమం ప్రతి సోమవారం కలెక్టర్ ఆదేశాల మేరకు ఉదయం పది గంటల నుంచి నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు.

'గ్రీవెన్స్'కు అధికారుల డుమ్మా



కోడూరు మండల పరిషత్ కార్యాలయంలోని గ్రీవెన్స్‌కు హాజరైన ఐదు శాఖల అధికారులు



కోడూరు తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీ కుర్చీలు

● ప్రజా సమస్యల పరిష్కారానికి 21శాఖలకు కేవలం ఐదు శాఖల అధికారులే హాజరు
● తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీగా దర్శనమిచ్చిన కుర్చీలు

కోడూరు: ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కోడూరులో నిర్వహించిన గ్రీవెన్స్‌కు అధికారులు డుమ్మా కొట్టారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రీవెన్స్‌ను నిర్వహించారు. ఉదయం 10.30 గంటలకు అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని మండల పరిషత్ అధికారులు ముందస్తుగానే సమాచారమిచ్చారు. మొత్తం 21 శాఖల అధికారులు గ్రీవెన్స్‌లో పాల్గొనాల్సి ఉండగా, కేవలం ఐదు శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. ఉదయం 11.30గంటల సమయానికి ఎంపీడీఓ, పీఆర్ ఏఈ, వైద్య, ఫిషరీస్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలకు చెందిన అధికారులు మాత్రమే పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌లో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. కనీసం కింద స్థాయి సిబ్బంది కూడా ఈ గ్రీవెన్స్‌లో పాల్గొనలేదు. రెవిన్యూ సిబ్బంది మట్టి, ఇసుక మాఫియాను ప్రోత్సహిస్తూ ప్రజల సమస్యలను కనీసం పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రజల సమస్యలను తెలుసుకొని సత్వర పరిష్కారం కోసం ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తుంటే అధికారులు వీటికి కూడా డుమ్మా కొట్టడంపై స్థానికులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ఇక కొంతమంది అధికారులు సాయంత్రానికి కార్యాలయాలకు వచ్చి రిజిస్టర్లలో సంతకాలు చేసి వెళ్లడం గమనార్హం.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే

మచిలీపట్నంటౌన్: నగరంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో ఈ నెల 25వ తేదీ మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈ ఎం.భాస్కరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు గొడుగుపేట, చెమ్మనగిరిపేట, విజయవాడ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య



చినకళ్లేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

చినకళ్లేపల్లి(ఘంటసాల): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన నాణ్యమైన విద్య అందిస్తారని ఐసీడీఎస్ శ్రీకాకుళం సెక్టార్ సూపర్‌వైజర్ డి.మేరీ అన్నారు. ఘంటసాల మండలం చినకళ్లేపల్లి పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు నిండిన చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేరీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారంతో కూడిన విద్య, ఆటలు, పాటలు నేర్పిస్తారని తెలిపారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాలను అర్హులు వినియోగించుకోవాలన్నారు. కొడాలి, గోగినేని పాలెం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుత్తికొండ రామారావు, వార్డు సభ్యులు ఎస్.సత్యం, శివనాగమణి, ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం టి.ఫణికుమార్, మహిళా పోలీస్ వి.స్వాతి, అంగన్‌వాడీ కార్యకర్తలు సీహెచ్.సునీత, సీహెచ్.జీవమణి, ఆయాలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

కోలాహలంగా విరుగలమ్మ నెల జాతర



నంగెగడ్డలో విరుగులమ్మ



యల్లారమ్మ

నంగేగడ్డ(నాగాయలంక): నంగేగడ్డ గ్రామంలో కొలువైన గ్రామ దేవత శ్రీవిరుగులమ్మ నెల జాతర మహోత్సవం ఆదివారం రాత్రి కోలాహలంగా సాగింది. ఆలయ ధర్మకర్త సనకా రమేష్‌బాబు పర్యవేక్షణలో అర్చకుడు మాదివాడ సాంబశివరావు అమ్మవారికి విశేష అలంకారంలో తీర్చిదిద్దారు. ఆలయ ప్రాంగణంలోని పోతురాజు చెట్టును భక్తులు పసుపు కుంకుమలతో సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలు జరిపారు.

● నాగాయలంక సబ్బినేనిబజారులో కొలువైన సబ్బినేని వంశీకుల ఇలవేల్పు యల్లారమ్మ అమ్మవారి నెల సంబరం ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. సబ్బినేని వంశీయులు, గ్రామస్తులు పసుపు కుంకుమలు, చద్ది నైవేద్యాలు సమర్పణతో మొక్కుబడులు చెల్లించుకున్నారు. తొలుత సంప్రదాయక రీతిలో పూజారులు యల్లారమ్మకు, పోతురాజు శిలకు నైవేద్యాలతో పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ సబ్బినేని భుజంగరావు, సురేష్‌బాబు, చౌదరి, వెంకటేశ్వరరావు, చందు, లక్ష్మణరావు, సబ్బినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి ఆలయ దశమ వార్షికోత్సవం



అయ్యప్పస్వామికి ప్రత్యేక అలంకారం



అయ్యప్పస్వామి ఉత్సవమూర్తికి అభిషేకం

బంటుమిల్లి: స్థానిక శ్రీ అయ్యప్పస్వామి ఆలయ దశమ వార్షికోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఉదయం గణపతి పూజ, కలశస్థాపన, పంచామృతాలతో స్వామివారి ప్రధానమూర్తి, ఉత్సవమూర్తులకు శ్రీసూక్త, మన్యుసూక్త, దుర్గాసూక్తాలతో అభిషేకాలు కనుల పండువలా నిర్వహించారు. పండితులు డి.సుధీర్‌శర్మ వేద మంత్రాల మధ్య పలువురు దంపతుల దీక్షధారణలతో పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన పురుషసూక్త సహిత రుద్రగాయత్రి హోమానికి పూర్ణాహుతి చేశారు. ప్రధానమూర్తిని సుందరంగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఆవరణలోని గణపతిస్వామి, సుబ్రహ్మణ్యస్వామి, మాలికాపురత్తమ్మదేవిల మూర్తులను సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మేళతాళాలతో స్వామివారి ఉత్సవమూర్తి గ్రామోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఇ.లీలాకృష్ణ, డి.రాంబాబు, సీతారామయ్య, జి. శ్రీనివాసరావు పలు గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ కోడూరు మండల అధ్యక్షుడిగా రామాంజనేయులు



నియామక పత్రాలను అందిస్తున్న యూనియన్ సభ్యులు

కోడూరు: పీఆర్టీయూ కోడూరు మండల శాఖ అధ్యక్షుడిగా విస్సంశెట్టి రామాంజనేయులను యూనియన్ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. దీన్ని సోమవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఎంఈఓలకు అందించారు. అధ్యక్షుడిగా రామాంజనేయులు, కార్యదర్శిగా వి.వి.రాజారవివర్మతో పాటు సభ్యులను తీర్మానించారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.బాబ్జి వీరికి నియామక పత్రాలు అందించారు. విద్య, పాఠశాల సంబంధ సమస్యల పరిష్కారానికి యూనియన్ కృషి చేస్తుందని ఆయన తెలిపారు. విద్యా సంవత్సర యూనియన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఎంఈఓలు టి.వి.ఎం.రామదాసు, వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.